సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



హుండీ లెక్కింపు

పెదపాడు: అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం 70 రోజులకు రూ.10.28 లక్షలు వచ్చినట్లు పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో తెలిపారు.



ఆక్వా సాగుకు ప్రాధాన్యత

ఆక్వా రొయ్యల సీడ్, ఫీడ్ ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. భీమవరంలో ఆక్వా ఎక్స్‌పోను గురువారం ప్రారంభించారు. IIలో ▸



ఖైదీల సంక్షేమానికి కృషి

ఖైదీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ చెప్పారు. కైకలూరు సబ్‌జైలులో నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. IIలో ▸

పవర్ ఫుల్

- ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా
- లోఓల్టేజ్ సమస్యకు స్వస్తి
- ఉభయగోదావరి జిల్లాలకు రూ.950 కోట్లు మంజూరు
- ఇప్పటికే 16 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



ఆకివీడు మండలం కుప్పనపూడిలో నిర్మాణం పూర్తి చేసుకున్న 220 కేవీ సబ్‌స్టేషన్

ఆకివీడు: ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడంతో వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బలోపేత సరఫరా పునరుద్ధరణ పథకం(ఆర్‌డీఎస్‌ఎస్) ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించి రూ. 950 కోట్లు మంజూరు అయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు. ఇటీవల విద్యుత్ వినియోగం అధికమైంది. ఆక్వా రంగానికి, ఇతర పంటలకు విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో కూడా గృహావసరాలకు విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో పురాతన కండెన్సర్లు(లైన్లు), ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థం సరిపోకపోవడంతో విద్యుత్ సమస్యలు తీవ్రమయ్యాయి. వీటికి చెక్ పెట్టేలా ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా పనుల్ని వేగవంతం చేశారు. దీంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడంతో ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు : ఉమ్మడి జిల్లాలో 220 కేవీ, 33 కేవీ సబ్ స్టేషన్లు ఎక్కడ అవసరమైతే ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ సిద్ధంగా ఉంది. 220 కేవీ సబ్ స్టేషన్లు కొప్పాక, సరిపల్లె, రుస్తుంబాదల నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుప్పనపూడి శివారు తాళ్లకోడులో 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుంది. విద్యుత్ సరఫరా చేసే 12 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు(5 ఎంవీఏ), నాలుగు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పూర్తి అయింది. జిల్లాలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 5,600 ఏర్పాటు చేశారు. 33 కేవీ సబ్ స్టేషన్లు కొత్తగా 10 నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. జగనన్న కాలనీల్లో అవసరమైన చోట్ల 33 కేవీ సబ్ స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. మల్లేశ్వరం, యండగండి, లోసరి ప్రాంతాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటుకు అనుమతి మంజూరైంది. పాత లైన్లు(కండన్సర్లు) స్థానే కొత్తవాటి ఏర్పాటు కూడా చురుగ్గా సాగుతోంది. జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు వేగంగా సాగుతోన్నాయి.

ఉమ్మడి జిల్లాలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	:	12 (5ఎంవీఏ), 4 (8ఎంవీఏ)
33 కేవీ సబ్ స్టేషన్లు పూర్తయినవి	:	10 (మరో మూడు మంజూరు)
220 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు	:	3 (మరొకటి పూర్తి)
డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు	:	5,600

కోతల్లేని విద్యుత్



విద్యుత్ సరఫరా మెరుగుపడింది. గతం కంటే ఎంతో బాగుంది. కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో ప్రజలకు, వ్యాపారులకు, ఆక్వా రైతులకు ఇబ్బంది లేదు.

– కె.అప్పారావు, మోగల్లు, పాలకోడేరు మండలం

మెరుగుపడిన విద్యుత్ సరఫరా



విద్యుత్ సరఫరా ఇటీవల మెరుగు పడింది. నిరంతరం విద్యుత్ సరఫరా అవుతోంది. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో ఆక్వా రైతులకు ఇబ్బందులు తొలిగాయి.

– కేశిరెడ్డి వెంకటరత్నం, ఆదర్శ రైతు, కోళ్లపర్రు, ఆకివీడు మండలం

అవసరమైన చోట సబ్‌స్టేషన్లు



శివారు ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా అవసరమైన చోట సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. జగనన్న కాలనీల్లో మెరుగైన విద్యుత్ అందజేస్తున్నాం.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆర్‌డీఎస్‌ఎస్‌కు రూ. 950 కోట్లు



ఉమ్మడి జిల్లాలో మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాకు ఆర్‌డీఎస్ పథకం కింద రూ. 950 కోట్లు మంజూరు అయింది. అవసరమైన చోట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు నిర్మాణం చేపడుతున్నాం.

– సాల్మన్‌రాజు, ఉమ్మడి జిల్లా ఎస్ఈ, ఈపీడీసీఎల్, ఏలూరు

న్యూస్‌రీల్

92 శాతం పెన్షన్ల పంపిణీ



భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ రెండు రోజుల్లో 92 శాతం పంపిణీ చేశారు. జిల్లా మొత్తం 2,24,862 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా వారికి రూ.61.36 కోట్లు పంపిణీ చేశారు. బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా 2,06,500 మందికి పెన్షన్ పంపిణీ పూర్తి చేయగా రూ.56.33 కోట్లు ఖర్చు చేశారు.

ఏఎస్సై సాయిబాబాకు ఉత్తమ సేవా పతకం



సాయిబాబా

పాలకోడేరు: పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న జల్లూరు వెంకట సత్య సాయిబాబాకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం అవార్డు ప్రకటించింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవం రోజున ఈ పతకాన్ని ప్రదానం చేస్తారు. ఆయన 1987లో కానిస్టేబుల్ గా ఉద్యోగంలో ప్రవేశించి, అడ్డతీగల, ఏలూరు, భీమవరం వన్ టౌన్, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, భీమవరం టూటౌన్ , నిడమర్రు, అత్తిలి ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం పాలకోడేరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నారు.

మేలైన పద్ధతులతో పొలంబడి



పొలంబడి శిక్షణలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటేశ్వరులు

ఏలూరు(మెట్రో): మేలైన వ్యవసాయ పద్ధతులతో పోలంబడి కార్యక్రమంపై రాష్ట్ర వ్యవసాయశాఖ అధ్వర్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జోనల్ స్థాయి శిక్షణ కార్యక్రమానికి ఏడు జిల్లాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల అధికారులు పాల్గొని శిక్షణ ద్వారా సర్టిఫికేషన్ మెలకువలను తెలుసుకున్నారు. వ్యవసాయశాఖ కార్యాలయం ఏడీఏ వేంకటేశ్వరులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ రైతులకు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు చేరవేసేందుకు పొలంబడి కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేలైన యాజమాన్య పద్ధతులతో నిర్వహించే పొలబడి కార్యక్రమానికి కావలసిన క్యూఎంఎస్ మాన్యువల్ ప్రిపరేషన్ గురించి క్వాలిటీ సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ ఆథారిటీ మేనేజర్ డాక్టర్ జీ.యుగంధర్ వివరించారు. పొలంబడి సెక్షన్ ఏడీఏ వెంకటేశ్వర్లు మేలైన యాజమాన్య పద్ధతులు, పొలంబడి యాజమాన్య పద్ధతులు, రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులు, ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో అందుబాటులో ప్లాట్లు

నూజివీడు: నూజివీడు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మధ్యాదాయ వర్గాల వారికి అందుబాటులో పట్టణంలో ఎంఐజీ జగనన్న స్మార్ట్‌టౌన్ షిప్‌ను ఏర్పాటు చేశామని, దీనిలో గజం రూ.8500కే విక్రయిస్తున్నట్లు ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించుకునే అవకాశాన్ని ఏపీ సీఆర్డీఏ కల్పిస్తోందన్నారు. విస్సన్నపేట రోడ్డులో మామిడి పరిశోధనాస్థానం ఆనుకొని ఏర్పాటు చేసిన ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్లకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నందున నవంబరు 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. 40.78 ఎకరాల విస్తీర్ణంలో 393 ప్లాట్లతో ఎంఐజీ నూతన లే అవుట్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కోసం 5 శాతం ప్లాట్లు రిజర్వు చేశామన్నారు. 150, 200, 240 గజాల వైశాల్యంతో కూడిన ప్లాట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ–లాటరీ నిర్వహించి ఎంపికైన లబ్ధిదారునికి 24 గంటల లోపు ప్లాటు కేటాయింపు పత్రాన్ని అందజేస్తామన్నారు.

డీసీఎంఎస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



బాణసంచా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

కాళ్ల: డీసీఎంఎస్ ద్వారా జిల్లాలో రైతులకు విశిష్ట సేవలు అందించడంతో పాటు నాణ్యమైన దీపావళీ మందులు విక్రయించడం అభినందనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరంలో డీసీఎంఎస్ ద్వారా ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా విక్రయకేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొయ్యే మోషేన్ రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహ రాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులతో పాటు జిల్లాలో ప్రజలందరికీ దీపావళి పర్వదినం పురస్కరించుకుని దీపావళి మందులు శివకాశీ నుంచి సరసమైన ధరలకే ప్రజలకు అందిస్తున్నారన్నారు. భీమవరం, ఉండి నియోజకవర్గాల ప్రజలకు అందుబాటులోకి బాణసంచా మందులు అందించేందుకు పెదఅమిరంలో విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేయటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీమవరం ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గూడూరి ఉమాబాల, ఏఎస్ రాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, తోట భోగయ్య , డీసీఎంఎస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కల్యాణ మండపానికి రూ.50 లక్షల నిధులు



మత్స్యకార మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి, చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం: పట్టణంలోని పార్కురోడ్డులో ఉపయోగంలో లేని మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని మత్స్యకార కల్యాణమండపంగా తీర్చిదిద్దడానికి ఎంపీ నిధుల నుంచి రూ 50 లక్షలు మంజూరు చేస్తానని రాజ్యసభ సభ్యుడు, మత్స్యకార రాష్ట్ర నేత మోపిదేవి వెంకటరమణ హామీ ఇచ్చారు. గతంలో రూ.90 లక్షలతో నిర్మించిన మోడల్‌ఫిష్ మార్కెట్ భవనాన్ని మత్స్యకారుల కల్యాణమండపంగా అభివృద్ధి చేయాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నిర్ణయించారు. రూ.కోటి నిధులతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గురువారం పట్టణానికి వచ్చిన ఎంపీ మోపిదేవితో కలిసి మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని సందర్శించారు. భవనాన్ని కల్యాణ మండపంగా రూ. కోటి వ్యయంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంపీ నిధులు రూ.50 లక్షలు ఇవ్వాలని కోరారు. దీనికి మోపిదేవి వెంటనే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి, కల్యాణ మండపం త్వరగా అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, మత్స్యకార సొసైటీ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బంధన పూర్ణ, మల్లాడి బుజ్జి, బర్రి జయరాజు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమావేశాన్ని నిర్వహించారు .కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐఎంఈ, పోలీసులు టీంగా ఏర్పడి డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 120 అల్ట్రా స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని, వాటిలో ప్రభుత్వ ఆస్పత్రిలో 15, ప్రైవేట్ ఆస్పత్రిలలో 105 ఉన్నాయన్నారు. కొత్తగా అల్ట్రా స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ల్యాబ్‌లు, హాస్పటల్‌ను పక్కాగా తనిఖీ చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే తీసుకునే చర్యలపై ముందుగానే తెలియ చెప్పాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎం అండ్ హెచ్‌ఓ డా.డి.మహేశ్వరరావు, అడిషనల్ డీఎం హెచ్‌ఓ డాక్టర్ బి.భానునాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధాలక్ష్మి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కుల కల్పన పూర్తిచేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): భూ యాజమాన్య హక్కులను లబ్ధిదారులకు కల్పించే ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక జాయింటు కలెక్టరు చాంబరులో జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి ఎస్సీ కార్పొరేషన్, అసైన్డ్ ఇనామ్, గోదావరి లంకా భూములపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 20 సంవత్సరాల పైబడి అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులను గుర్తించి వారికి యాజమాన్య హక్కులను కల్పిస్తున్నామన్నారు. ఆకివీడు మండలం ఎస్సీ కార్పొరేషన్ భూములు 33 మందికి పట్టాలు 22(ఎ) నుంచి తొలగించినట్లయితే వారికి పూర్తి భూహక్కు కలుగుతుందని, ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నేటి వరకూ గడువు ఉందని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, వివరాలకు సమీపంలోని స్టడీ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకూ గడువు ఉందన్నారు.

కార్గో డోర్ డెలివరీ సేవలకు ఆదరణ



తణుకులో కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలు ప్రయాణికులు, వినియోగదారుల ఆదరణ పొందుతుండడం అభినందనీయమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో మేనేజరు సుబ్బారావు అన్నారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా తణుకులో గురువారం డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంత సురక్షితమో వినియోగదారుల పార్శిళ్లు అంతే భద్రంగా ఇంటి గుమ్మంలోకి చేరుస్తున్నట్లు చెప్పారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోనే ఇప్పటివరకు తణుకు కార్గో సెంటర్ డోర్ డెలివరీ పార్శిల్స్ బుకింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. కార్గో వినియోగదారులతోపాటు డిపో మేనేజరు గిరిధర్‌కుమార్, కార్గో డీఎంఈ షేక్ లాల్‌లను సుబ్బారావు అభినందించారు. అనంతరం తణుకు ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి నుంచి రూ.3 వేల పింఛన్

- జిల్లాలో 2.26 లక్షల మంది లబ్ధిదారులు
- ప్రతి నెల రూ. 61.81 కోట్ల పంపిణీ



అత్తిలి మండలం ఈడూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

సాక్షి, భీమవరం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోడంలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేయనుంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ప్రతి నెలా అందించే పింఛన్‌ను కొత్త సంవత్సరంలో రూ. 3 వేలు చేయనున్నారు. ప్రస్తుతం రూ. 2,750 పింఛన్ అందిస్తుండగా జనవరి నుంచి రూ. 3 వేలు అందుకోనున్నారు.

2.26 లక్షల మందికి రూ.61.81 కోట్ల పంపిణీ

జిల్లాలో ఇంతవరకు వివిధ రకాల పింఛన్ల కింద 2,26,480 మందికి ప్రతి నెల సుమారు రూ. 61.81 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వీరిలో వృద్ధులు 1,24,668 మందికి రూ.34.28 కోట్లు, ఒంటరి మహిళలు 6,714 మందికి రూ.1.84 కోట్లు, వితంతువులు 46,855 మందికి రూ.12.88 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇప్పటివరకు సుమారు రూ.49 కోట్లు పింఛన్ అందిస్తుండగా జనవరి నుంచి మరో రూ.4.46 కోట్లు పెరగనుంది.

గతంలో పింఛన్ కోసం అగచాట్లు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే లబ్ధిదారులు తీవ్ర అగచాట్లు పడాల్సివచ్చేది. నాలుగైదు నెలలకు నిర్వహించే జన్మభూమి కమిటీ సమావేశాల్లో గంటల తరబడి పింఛన్ కోసం ఎదురుచూడాల్సివచ్చేది. కొత్తగా పింఛన్ పొందాలంటే సంవత్సరాల తరబడి అనేక దరఖాస్తులు పెట్టుకోవడమే గాక జన్మభూమి కమిటీలకు ముడుపులు ముట్టచెపితే పరిసర ప్రాంతాల్లో పింఛన్ పొందుతున్నవారు చనిపోతే కొత్తవారికి పింఛన్ మంజూరయ్యేది. నెలకు కేవలం రూ.1000 మాత్రమే అందిస్తూ ఎన్నికల వేళ రూ.2 వేలకు పెంచారు. ప్రస్తుతం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జగన్ ప్రభుత్వం కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా పింఛన్‌లు మంజూరు చేస్తుంది. ప్రతి నెలా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. జనవరి నుంచి పింఛన్ పెరగనుందన్న సంగతి తెలిసిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దకొడుకులా ఆదుకుంటున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ పెంచి పెద్దకొడుకులాగా ఆదుకుంటున్నారు. వృద్ధాప్యంలో పెన్షన్ పెంపు మాకు ఎంతో బాసటగా ఉంది. రాజకీయాలకు అతీతంగా పింఛన్‌లు మంజూరు చేస్తున్నారు. ప్రతి నెలా వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ సొమ్ము అందచేస్తున్నారు.

– సీహెచ్ అనంతలక్ష్మి, రాయకుదురు

ఆసరాగా జగన్



మాలాంటి వృద్ధుల జీవితాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆసరాగా నిలబడుతున్నారు. ప్రతి ఏటా పింఛన్ పెంచుతూ వస్తున్నారు. మరొకసారి పెంచి రూ.3000 చేయడం వల్ల మాలాంటి వృద్ధులకు ఎంతో ధైర్యంగా ఉంటుంది. కుటుంబంలో కూడా గౌరవం పెరుగుతుంది. ఎప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలి.

– గుర్రం బాయ్యమ్మ, జువ్వలపాలెం

మాట నిలబెట్టుకోవడం ఆనందంగా ఉంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ఆనందంగా ఉంది. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని పెన్షన్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇవ్వడం హర్షదాయకం. మాకు ఇస్తున్న పెన్షన్ ఎంతో ఉపయోగపడుతుంది. ఒంటరిగా జీవిస్తున్న నాలాంటి మహిళలకు ఎంతో మేలు చేశారు.

– కె.శశిరేఖ, రాయకుదురు

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



పండితవిల్లూరు హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ ఆర్.వెంకటరమణ

పోడూరు: 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ ఆర్.వెంకటరమణ పిలుపునిచ్చారు. వార్షిక తనిఖీలో భాగంగా పండితవిల్లూరు జెడ్పీహైస్కూలును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. 10వ తరగతి విద్యార్థులు ఇప్పట్నుంచే కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులంతా శ్రద్ధగా చదువుతూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వార్షిక తనిఖీకి ముందు పాఠశాల ఆవరణలో డీఈఓ మొక్కలు నాటారు. నూతనంగా నిర్మించిన టెన్నికాయిట్ కోర్టును, టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. అనంతరం హైస్కూలులో రికార్డుల నిర్వహణ, విద్యార్థుల ప్రతిభా పాటవాలను, ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. హెచ్‌ఎం వీరవల్లి సత్య ప్రియరామ్‌ను, ఉపాధ్యాయులను అభినందించారు.

క్లుప్తంగా

గుంటూరు వెళ్లి పింఛను అందజేత



గుంటూరులో రౌతు నర్సింహులుకు పింఛను అందిస్తున్న వలంటీర్ కె.నవ్యశ్రీ, కుంచాడ బాబ్జీ

ఆకివీడు: జిల్లాలు దాటి వెళ్లి మరీ పింఛను అందజేస్తూ మానవత్వం చాటుతున్నారు వలంటీర్లు. ఒకటో తేదీన స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు పింఛను సొమ్మును అందజేసిన తరువాత దూర ప్రాంతాల్లో ఉన్న వారికి, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో ఉన్నవారికి ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. ఆకివీడు ఆరో వార్డులో నివసిస్తున్న రౌతు నర్సింహులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల పింఛను సొమ్ము అందుకోలేని స్థితిలో ఉన్న ఆయన వద్దకు వలంటీర్ కె.నవ్యశ్రీ వెళ్లి గురువారం పింఛను సొమ్ము అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. నవ్యశ్రీ వెంట వైఎస్సార్‌సీపీ 6వ వార్డు ఇన్‌చార్జి కొంచాడ బాబ్జీ వెళ్లి నర్సింహులు పరామర్శించి ధైర్యం చెప్పారు. వలంటీర్ నవ్యశ్రీ సేవలను పలువురు అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కాళ్ల: గొలుసు దొంగతనం కేసులో నిందితుడికి కోర్టు ఏడాది జైలుశిక్ష విధించిందని ఎస్సై వీరభద్రరావు గురువారం చెప్పారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది జక్కరంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడు అయిన గరికే సుబ్బరాజు నేరం రుజువు కావడంతో అతనికి భీమవరం ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ జి.సురేష్ బాబు ఒక ఏడాది కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్స్ ధనుంజయనాయుడు, ముత్యాల రాజులను ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

భీమవరం : భీమవరం ఒకటో పట్టణ పరిధిలోని రైల్వే జంక్షన్ వద్ద మూడు కిలోల గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ అడబాల శ్రీను గురువారం చెప్పారు. విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. గురువారం నిర్వహించిన తనిఖీల సమయంలో ఒక వ్యక్తి తప్పించుకున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆక్వా సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు
- భీమవరంలో ఆక్వా ఎక్స్‌పో ప్రారంభం





భీమవరంలో ఆక్వా ఎక్స్‌పోను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు, విజయ్‌గుప్త, ఆక్వా ఎక్స్‌పోను పరిశీలిస్తున్న మోషేన్‌రాజు, పీవీఎల్

సాక్షి, భీమవరం: ఆక్వా సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అయితే రైతులు రొయ్యల సీడ్, ఫీడ్ ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. భీమవరంలో ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే ఆక్వా ఎక్స్‌పోను గురువారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ప్రధానంగా రొయ్యలు, చేపల సాగులో రైతులు వినియోగించే వివిధ రకాల పరికరాలు, ఫీడ్‌కు సంబంధించి వారికి అవగాహన కల్పించడానికి ఆక్వా ఎక్స్‌పో ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఆక్వా రైతులు తమ సొంత అనుభవంతోపాటు శాస్త్రవేత్తలు చెబుతున్న పద్ధతులను పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రొయ్యల సాగులో సీడ్ ఎంపిక ప్రధానమైనదని, తక్కువ ధరకు లభిస్తుందని నాణ్యత లేని సీడ్ వేయడం వల్ల తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. ఆక్వా సాగులో విద్యుత్ సబ్సిడీపై కొంతమంది రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆక్వా జోన్స్ ప్రమేయం లేకుండా 10 ఎకరాల లోపు విస్తీర్ణంలో రొయ్యల సాగు చేస్తున్న రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రొయ్యలతోపాటు చేపల సాగు ఎంతైనా అవసరమన్నారు. రైతులు బాగుంటేనే ఆక్వా ఫీడ్, సీడ్, ఇతర పరికరాల తయారీ కంపెనీలు బాగుంటాయనే సత్యాన్ని గ్రహించి కంపెనీలు రైతులకు ఉపయోగపడేలా యంత్రాలు, ఇతర పరికరాలను నాణ్యతతో తక్కువ ధరకు అందించడానికి కృషి చేయాలన్నారు. ఆక్వా రంగానికి ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయని, వీటి ద్వారా రైతులకు నూతన టెక్నాలజీ, సరికొత్త మేతలు, మందులపై అవగాహన కలుగుతుందన్నారు.

ఆకట్టుకున్న ఆక్వా ఎక్స్‌పో

ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆక్వా ఎక్స్‌పో రైతులు, విద్యార్థులను ఆకట్టుకుంది. విశాలమైన ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంస్థలు తమ వస్తువులు, ఫీడ్, మందుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో రైతులు, ఫిషరీస్ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రదర్శనను తిలకించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, వరల్డ్ ఫిష్‌సెంటర్ రిటైర్డ్ ఏడీజీ డాక్టర్ ఎం.విజయ్‌గుప్తా, ఆక్వా ఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ సీఈవో దంతులూరి వేణు, డాక్టర్ సీకే మూర్తి, సమీర్‌పాత్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో సమన్వయం అవసరం

ఆక్వా సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతోపాటు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు కలిసి పనిచేస్తేనే ఆక్వా రంగం అభివృద్ధి చెంది రైతులు లాభాలబాట పడతారని ఆక్వా శాస్త్రవేత్త, వరల్డ్‌ఫిష్ సెంటర్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, పద్మశ్రీ ఎం. విజయ్‌గుప్త అన్నారు. భీమవరంలో ఆక్వాఫార్మింగ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్ సంస్థ ఏర్పాటు చేసిన ఆక్వా ఎక్స్‌పోలో పాల్గొన్న గుప్త తనను కలసిన విలేకర్లతో మాట్లాడారు. చేపల సాగులో నష్టాలను అధిగమించడానికి ప్రధానంగా రైతుల ఆలోచనలో మార్పు అవసరమన్నారు. రొయ్యలసాగు చాలా సున్నితమైనదని, ఎక్కువ పెట్టుబడితో కూడుకున్నదని, ఈ సాగులో నష్టాలతో పాటు లాభాలు పెద్ద మొత్తంలోనే ఉంటాయన్నారు. అయితే చేపల సాగులో భారీ మొత్తంలో లాభాలు లేకున్నా నష్టాల సమస్య ఉండదని గుప్త స్పష్టం చేశారు. రైతులంతా సమన్వయంతో సాగు చేస్తూ సహకార వ్యవస్థ విధానాన్ని ఆచరిస్తే సమన్వయం ద్వారా మంచి ఫలితాలు దక్కుతాయన్నారు. అధునాతన టెక్నాలజీని వినియోగించుకోవడం ఎంతైనా అవసరమన్నారు. ఆస్ట్రేలియాలో మొక్కజొన్న సాగు రైతులందరూ ఐక్యంగా మంచి ఫలితాలు సాధించారని, అదే విధాన్ని ఆక్వా సాగులో అమలు చేస్తే మంచి ఫలితాలు సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చేపల సాగును మరింత ప్రోత్సహించాలని గుప్త కోరారు.

ఆర్టీసీ డీఎంపై డ్రైవర్ చాకుతో దాడి



డీఎంను పరామర్శిస్తున్న ఉన్నతాధికారులు

తణుకు: ఆర్టీసీ తణుకు డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్‌పై అదే డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ శానాపతుల నాగరాజు చాకుతో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి. డ్రైవర్ శానపతుల నాగరాజును ఇటీవల టిమ్ డ్యూటీ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే తాను చదువుకోలేదని, ఈ డ్యూటీ చేయలేనని చెప్పడంతో ఇటీవల నాగరాజుకు దీనిపై శిక్షణ ఇచ్చారు. నాగరాజు సీనియారిటీ ప్రకారం బడి బస్సుపై డ్యూటీ వేశారు. గురువారం విధులకు వచ్చిన నాగరాజు మరోసారి డీఎంతో తాను టిమ్ డ్యూటీ చేయలేనని చెప్పాడు. దీంతో గైర్హాజరు అయినట్లు రిజిస్టర్‌లో నమోదు చేస్తానని డీఎం చెప్పడంతో ఆగ్రహంతో తనతో తెచ్చుకుని చాకుతో దాడి చేశాడు. దీంతో డీఎం ఎడమచేతికి తీవ్ర గాయమైంది. వెంటనే ఆయనను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నాగరాజును పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డీఎం గిరిధర్‌కుమార్‌ను ఆర్టీసీ ఈడీ కె.గోపీనాథ్‌రెడ్డి, రీజనల్ మేనేజర్ వీరయ్యచౌదరి, ఏలూరు జిల్లా డీపీటీవో వరప్రసాద్, తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణ, తోటి ఉద్యోగులు పరామర్శించారు.

ఖైదీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా
- కైకలూరులో నూతన సబ్‌జైలు నిర్మాణానికి శంకుస్థాపన

కైకలూరు: రాష్ట్రంలో ఖైదీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, ఏపీ హోం ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. కైకలూరు సబ్‌జైలులో రూ.2.10 కోట్ల అంచనాతో నిర్మించనున్న నూతన సబ్‌జైలు భవనానికి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కైకలూరు సబ్‌జైలు బ్రిటీష్ కాలంలో నిర్మించిందని, పైకప్పు దెబ్బతిని వర్షపు నీరు గదుల్లోకి చేరుతోందన్నారు. దీంతో మరమ్మతుల కంటే నూతన భవనం నిర్మించాలని నిర్ణయించామన్నారు. నూతన సబ్‌జైలులో మగ, ఆడ ఖైదీలకు విడివిడిగా బ్యారెక్స్ నిర్మిస్తామన్నారు. ఖైదీలకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని జైళ్లలో కావాల్సిన మౌలిక వసతుల వివరాలు తెలుసుకున్నామన్నారు. ఖైదీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి సబ్‌జైల్‌లోనూ అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్, జిల్లా జైళ్లశాఖ అధికారి ఎండీ ఇర్ఫాన్, విజయవాడ డీఎస్‌జేవో వి.ఉమామహేశ్వరరావు, కైకలూరు సబ్‌జైలు సూపరింటెండెంట్ బొత్స అప్పారావు, మచిలీపట్నం జైలర్ రమేష్, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, కైకలూరు రూరల్, టౌన్ సీఐలు కృష్ణకుమార్, రఘు, ఎస్సైలు రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



కైకలూరు సబ్‌జైలులో శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీజీ హరీష్‌కుమార్ గుప్తా



ఏలూరులో హరీష్‌కుమార్ గుప్తాకు పూలకుండీ అందిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరులో సాదర స్వాగతం

ఏలూరు టౌన్: కైకలూరు పర్యటనలో భాగంగా ఏలూరు నగరానికి వచ్చిన ఏపీ రాష్ట్ర హోం సెక్రటరీ, రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్‌గుప్తాకు గురువారం పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి సాదరంగా స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా పూలకుండీలను అందజేశారు. అనంతరం ఆయన కైకలూరు పర్యటను వెళ్లారు.

బ్యాంకు దోపిడీ కేసులో దర్యాప్తు ముమ్మరం

నరసాపురం: పట్టణంలోని ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లో బుధవారం జరిగిన దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఓ జాతీయ బ్యాంకు బ్రాంచ్‌లో పట్టపగలు ఒక్క వ్యక్తి వచ్చి కత్తితో బ్యాంకు ఉద్యోగులను బెదిరించి రూ.6.50 లక్షలు నగదును సినీపక్కీలో దర్జాగా కాజేసుకుని పోవడం చర్చనీయాంశంగా మారింది. గురువారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ బ్యాంకు కార్యాలయానికి వచ్చి క్యాషియర్‌తో పాటు కొందరు ఉద్యోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ వ్యక్తి బ్యాంకుకు వచ్చినట్టుగా ఏమైనా వివరాలు ఉన్నాయా అనే కోణంలో ఆరా తీశారు. ఇదిలా ఉంటే పోలీసులు ఈ కేసులో దూకుడుగా ముదుకు వెళుతున్నా ఇప్పటివరకు ప్రాథమిక ఆధారాలు లభ్యం కాలేదని సమాచారం. బ్యాంకులో సీసీ పుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముఖానికి మాస్కు, తలకు టోపీ పెట్టుకుని బ్యాంకులో ప్రవేశించిన ఆగంతకుడు నేరుగా క్యాషియర్ రూమ్‌లో డబ్బులు లెక్కిస్తున్న ప్రాంతానికి వెళ్లి కత్తితో బెదిరించి సొమ్ము పట్టుకుపోయాడు.

బ్యాంక్ ఉద్యోగుల నిర్లక్ష్యం..

ఆగంతకుడు ఒక్కడే రావడం, ఎలాంటి వాహనాన్ని వినియోగించకపోవడం, చేతిలో బ్యాగ్‌తో మెయిన్‌రోడ్డులో నడుచుకుంటూ వెళ్లినట్లు సీసీ టీవీ పుటేజీ ద్వారా గుర్తించినట్లు తెలిసింది. మరోవైపు ఈ ఘటనలో బ్యాంకు అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యం కూడా కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. కేసును ఛేదించడం కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ రవిప్రకాష్ విలేకరులతో చెప్పారు.



బ్యాంకులో ఉద్యోగులతో ఘటనపై ఆరా తీస్తున్న జిల్లా ఎస్పీ రవిప్రకాష్

అనుమానంతోనే భార్యను చంపేశాడు

పెనుగొండ: పెనుగొండ అడ్డపుంతలో హత్యకు గురైన మహిళ చివటం నందినిగా గుర్తించామని, భర్తే అనుమానంతో ఆమెను హతమార్చినట్లు దర్యాప్తులో తేలిందని నర్సాపురం డీఎస్పీ రవి మనోహరచారి చెప్పారు. గురువారం సాయంత్రం విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. అక్టోబరు 31న పెనుగొండ అడ్డపుంతలో మహిళ శవం లభ్యం కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా కేసు నమోదు చేసి ఎస్పీ యూ రవి ప్రకాష్ పర్యవేక్షణలో తన ఆధ్వర్యంలో సీఐ జీవీవీ నాగేశ్వరరావు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో మృతదేహాన్ని చివటం నందిని (20)గా గుర్తించారు. చివటం నందిని 2019లో రామ్‌ప్రసాద్‌తో ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి 18 నెలల దేవాన్ష్ అనే కుమారుడు ఉన్నాడు. ఇటీవల నందిని ప్రవర్తన బాగోలేదని అనుమానించిన భర్త రామ్‌ప్రసాద్ ఆమెతో తరచూ గొడవ పడుతున్నాడు. అక్టోబర్ 30న వీరిద్దరి మధ్య గొడవ తారాస్థాయి చేరింది. ఈ క్రమంలో నందిని పుట్టిల్లు గౌరీపట్నం తీసుకువెళతానని చెప్పి, ముందుగానే అనుకున్న పథకం ప్రకారం పెనుగొండ అడ్డపుంతలోకి తీసుకువెళ్లి ఆమెను చాకుతో పొడిచి బోదేలో పడవేశాడు. హత్య చేసిన విషయాన్ని రామ్‌ప్రసాద్ అత్త మల్లేశ్వరికి ఫోన్‌లో సమాచారం అందించి పరారయ్యాడు. దర్యాప్తులో పూర్తి విషయాలు తెలిసి నిందితుడు రామ్‌ప్రసాద్ కోసం పోలీసులు గాలించడం మొదలుపెట్టారు. గురువారం పెనుగొండ శివారు నక్కల డ్రయిన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు. తానే నందినిని హత్య చేసినట్లు నిందితుడు తెలిపాడన్నారు. సమావేశంలో సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ పాల్గొన్నారు.



పెనుగొండలో నందిని హత్య కేసులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి మనోహర చారి

● గడపగడపకు సంక్షేమం



కాళ్ల : జువ్వలపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

9న భీమవరంలో బాలల సైన్స్ కాంగ్రెస్

భీమవరం (ప్రకాశం చౌక్): ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఆర్‌వీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని యాజమన్యాల స్కూళ్ల నుంచి విద్యార్థులతో సైన్స్ ప్రాజెక్టులు చేయించి తీసుకురావాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఒక గైడ్ టీచర్, ప్రతి ప్రాజెక్టుకు ఒక బాల శాస్త్రవేత్త, రెండు కాపీల ప్రాజెక్టు పుస్తకాలు, లాగ్ బుక్, నాలుగు చార్టులు మాత్రమే తీసుకురావాల్సి ఉంటుందని, ఎటువంటి నమూనాలు, ఎగ్జిబిట్స్ తీసుకురాకూడదన్నారు. ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థ, అర్థం చేసుకోవడం, ఉప అంశాలపై ప్రాజెక్ట్స్ తీసుకురావాలని తెలియచేశారు. 9న భీమవరం కొత్త బస్‌స్టాండ్ వద్ద బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్, 93942 38826, జిల్లా అకడమిక్ సమన్వయాధికారి సీహెచ్ రాజు, 98484 44232 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మిద్దెతోటలతో కుటుంబ ఆరోగ్యం మెరుగు

ఉండి: ప్రతి ఒక్కరూ తమ మిద్దెపై ఉన్న ఖాళీస్థలంలో కూరగాయలు, ఆకుకూరల పెంపకం చేపడితే కుటుంబమంతా ఆరోగ్యంతో ఉంటుందని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై మహిళలకు గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మిద్దెతోటల పెంపకంతో కుటుంబ ఆరోగ్యం, ప్రతి మహిళ ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. దీంతోపాటు ఆర్థికంగా మహిళలు నిలదొక్కుకోవచ్చని అన్నారు. చిన్న చిన్న పెట్టుబడులతో మిద్దెతోటలు పెంచవచ్చని, ముఖ్యంగా సేంద్రియ పద్ధతుల్లో పెంచే మిద్దెతోటల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి మహిళ మిద్దెతోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిద్దెలపై ఉండే ఖాళీ స్థలాన్ని నిరుపయోగంగా విడిచిపెట్టక నచ్చిన ఆకుకూరలు, కూరగాయలు, పుట్టగొడుగులు, తెనెటీగల పెంపకం చేపట్టవచ్చని సూచించారు. ఇందుకు అవసరమైన సూచనలు, సలహాలను కేవీకే శాస్త్రవేత్తలు అందజేస్తారన్నారు. పుట్టగొడుగుల పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుందన్నారు. పుట్టగొడుగులు పెంచాలనుకునే వారు 21 రోజులు చీకటి గదిలో పెంచిన స్ప్రాటింగ్ బెడ్స్‌తో వారంరోజుల్లోనే పుట్టగొడుగులను పెంచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణకు హాజరైన ప్రతి మహిళకు వివిధ విత్తనాలతో కూడిన కిట్లను శాస్త్రవేత్తలు అందజేశారు. డాక్టర్ ఎన్ దెబోరా మెస్సియానా, డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ పీ వినయలక్ష్మీ, బీ రజిత తదితర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



కేవీకే శిక్షణలో పాల్గొన్న మహిళలతో శాస్త్రవేత్తలు

క్లుప్తంగా

వృద్ధురాలికి పింఛన్ అందజేత



మంచంపై వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవిప్రకాష్

పెంటపాడు: గ్రామ వాలంటీర్ల సేవలు మరువలేనివని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల గోవింద్ పేర్కొన్నారు. గురువారం ప్రత్తిపాడులో కదలలేని పరిస్థితిలో ఉన్న ఓ వృద్ధురాలికి వలంటీర్ రవిప్రకాష్ గురువారం పింఛన్ అందజేశాడు. ఈ సందర్భంగా వలంటీర్ సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి చక్రవర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

చిగురుపాటి విద్యా సంకల్పం కిట్లు పంపిణీ



విద్యా సంకల్పం కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిగురుపాటి విద్యా సంకల్పం కిట్లను లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు చేతుల మీదుగా గురువారం స్థానిక పాతూరు 12వ వార్డు సంజీవనగర్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ.సిరాజ్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, రమణయ్య, వైఎస్సార్ సీపీ వార్డు ఇంచార్జి చామన సూర్యచంద్రరావు, కోడే శ్రీను, ఎ.రవి, అద్దాల నరసింహారావు, వానపల్లి రాంబాబు, మల్లికార్జునరావు, ఆంజనేయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

93 మందికి వైద్య పరీక్షలు



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు వంగపండు రామమోహన్‌రావు ఆధ్వర్యంలో దాత ఆంజనేయులు ఆర్థిక సహకారంతో గురువారం కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఉచిత షుగర్ రక్త పరీక్షల శిబిరం జరిగింది. వైద్య సిబ్బందిచే 93 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని పసుమర్తి హనుమంతరావు ప్రారంభించారు. క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పచ్చా వెంకటేశ్వరరావు, పడాల మహేశ్వరరావు, యర్రా ఆంజనేయస్వామి, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కవి ప్రసాద్

తణుకు: ప్రముఖ భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి 126వ జయంతి పురస్కరించుకుని గురువారం తణుకులో వేడుకలు నిర్వహించారు. స్థానిక గాడేపల్లి అన్నపూర్ణమ్మ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా సాంస్కృతిక వేదిక సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ పాల్గొని కృష్ణశాస్త్రి కావ్యాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాళాభక్తుల సుజాత, ఉపాధ్యాయులు డి.రేఖాభవాని, ఐ.ప్రసన్న, ఎ.సుధారాణి పాల్గొన్నారు.

చాంబర్ కళాశాలలో వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్: మానవ సేవే మాధవ సేవన్న వివేకానందుని మాటలను స్ఫూర్తిగా తీసుకుని తమ కళాశాల విద్యార్థులు ఎంతో మంది ప్రాణాలను కాపాడేందుకు అత్యంత విలువైన రక్తదానం చేయడం అభినందనీయమని చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు అన్నారు. గురువారం కళాశాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావును కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, లయన్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కలిదిండి రామరాజు, ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు, అకాడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు, కోశాధికారి జల్లూరి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వీరంపాలెం గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి మాధవి అన్నారు. గురువారం మండలంలోని వీరంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాధవి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉన్నత ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. గతంలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసి గ్రామ స్థాయిలోనే వైద్యం అందించారన్నారు. మరో ముందుగు వేసి జగనన్న ఆరోగ్య సురక్షలో ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. నాడు వైఎస్సార్ ఎంతో సహృదయంతో ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఆయన అడుగు జాడల్లోనే సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. ఆయనకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్యులు జి.రూపాదేవి, ఏవీ.వెంకటేష్, గౌతమి, సూర్యసుభాషి, పి.కాంచన ప్రియలు 2001మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ జంపెల్లి సత్యవతి, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయురాలు వీవీఆర్.మల్లేశ్వరి, పంచాయతీ ఈవో బి.ఫణికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.బేబి, నాయకులు కేతిరెడ్డి రామచంద్రారెడ్డి, సీహెచ్‌వోలు కే.సూర్యకాంతం, ఎస్.నీరజ,డి.ప్రవల్లిక, కే.నాగేశ్వరరావు,బి.విజయలక్ష్మి, జి.దివ్య, ఎస్‌కే.నౌషద్, సోని, సందీప్‌రాజ్, లక్ష్మీదుర్గ, పి.నవ్యలక్ష్మి, ఇందిరప్రియాంక, జి.శరత్, డి.సత్తిబాబు, ఎంపీహెచ్ ఏలు, వీహెచ్ఎస్‌లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

పెంటపాడు: ప్రకృతివ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.పార్థసారది పేర్కొన్నారు. అలంపురం గ్రామంలో గత 13 వారాలుగా ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వ శాస్త్రవేత్తలు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో బీజామృతం, జీవామృతం తదితర ద్రావణాలు వల్ల చీడపీడలను నివారించుకొనే విధానం రైతులకు తెలిపారు. సార్వా పంటకు ప్రధానంగా చీడపీడలు నివారించే శక్తి కేవలం బీజామృతానికే ఉందన్నారు. ఈ సందర్భంగా కిచెన్ గార్డెన్‌లో కాయగూర మొక్కలకు కావాల్సిన జీవామృతాన్ని ఈ సందర్భంగా తయారు చేశారు. మార్కెట్లో తయారుగా ఉన్న కూరగాయలు రసాయన వ్యర్థాలతో ఉంటాయని, సహజ సిద్ధంగా పండించే కాయగూరలను స్వయంగా ఇంటిపెరట్లో పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకొని, ఖర్చును ఆదా చేసుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. శాస్త్రవేత్తలు వీరబాబు, దక్షిణామూర్తి, జి.సురేష్, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు రత్నాజీ, సుబ్బారావు, గుమ్మళ్ల వీర్రాజు తదితర ప్రతినిధులు గ్రామ రైతులు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.



జీవామృత ద్రావణం తయారీలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

తణుకు: ఈనెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో జరిగే మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి కోరారు. గురువారం తణుకులోని ఏపీ సీడ్స్ వద్ద రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. 17న నంద్యాలలో జరిగే మహిళల మహా ప్రదర్శన, బహిరంగ సభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా స్వేచ్ఛ, సమానత్వం సాధన దిశగా మహిళ హక్కుల పరిరక్షణ, మహిళా చట్టాల సక్రమ అమలుకు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల తక్షణ అమలు కోరుతూ పోరాట కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుపులేటి దానమ్మ, పిండి సత్యవతి, మేకా వెంకటలక్ష్మి, కవల మంగతాయారు, యార్లగడ్డ రామలక్ష్మి, టి.దుర్గేశ్వరి, జోన్నల లక్ష్మి, అర్వపల్లి దుర్గ, మీసాల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తణుకులో మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

ఆకివీడు: అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శనిలిచిందని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామంలో సకల జనుల సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించి అమలుజేయడం వల్లే దేశంలో వివక్ష దూరమైందన్నారు. ఓటు హక్కు, మహిళలకు స్వేచ్ఛా హక్కు, రిజర్వేషన్లు వంటివి రాజ్యాంగంలో రూపొందించారని వివరించారు. వాడవాడలా అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు అన్ని కులాల వారూ ముందుకొస్తున్నారని చెప్పారు. విగ్రహం ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ కేశిరెడ్డి కోటేశ్వరి, కృష్ణారావు దంపతులకు మోషేన్‌రాజు ధన్యవాదాలు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు మాట్లాడుతూ దేశ దుస్థితిని మార్చేందుకు అంబేడ్కర్ చక్కటి రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించి, ఉన్నత పదవులు ఇచ్చారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచే రాజ్యాంగం రూపొందించినందువల్లే అన్ని గ్రామాల్లో వీధుల్లో ఆయన విగ్రహాలు ఏర్పాటుకు ముందుకొస్తున్నారని చెప్పారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సభకు మాజీ ఎంపీటీసీ అంబటి రమేష్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పల్లెం అరుణకుమారి, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, కొటికలపూడి తాతాజీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అన్యం కృష్ణ, ఎంపీపీ కోఆప్షన్ సభ్యుడు షఫ్రక్, పాశం నర్సింహారావు, కేశిరెడ్డి వాసు, దిలీప్, జైభీమ్ యువజన సంఘ సభ్యులు పుచ్చకాయల దిలీప్ రాజు, కాకర్ల జయరాజు, దగ్గులూరి ఏసుబాబు, రామకూరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కోళ్లపర్రులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ట్రై మోటార్ సైకిళ్ల అందజేత

పెనుమంట్ర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ముగ్గురు వికలాంగులకు గురుకులంలో మూడు లక్షల అరవై వేల విలువైన త్రీ వీలర్ మోటార్ సైకిల్ ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, పెనుగొండ ఏఎంసి చైర్‌పర్సన్ వెంకటరమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పర్యావరణ పర్యావరణ పరిశుభ్రతను పాటిస్తూ గ్రామ సర్పంచులు ప్రజల్లో చైతన్య తీసుకురావాలని గ్రామాలు సుందరంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పద్మజ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ, అనిత ప్రవీణ్ మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు గూడూరు దేవేంద్రుడు ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రా రవికుమార్ మహిళా విభాగం అధ్యక్షురాలు కర్రి అనురాధ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మార్పు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ డీఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కుంచనపల్లి, ఎల్.అగ్రహారం, మోదుగ గుంట, కొండ్రుప్రోలు, చినతాడేపల్లి, మెట్ట ఉప్పరగూడెం, అప్పారావుపేట, ఇటుకులగుంట, కొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఈ నెల 3వ తేదీన శుక్రవారం ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33/11కేవీ పెదతాడేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు వీలుగా తాడేపల్లిగూడెంలోని వన్ టౌన్ నార్త్‌లోను, టూ టౌన్ సౌత్‌లోను విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

చిరస్మరణీయుడు ఆకుల శ్రీరాములు

తణుకు టౌన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యా రంగం అభివృద్ధికి ఆకుల శ్రీరాములు విశేష కృషి చేశారని ఏఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఆకుల విజయవర్ధన్ చెప్పారు. గురువారం ఆకుల శ్రీరాములు 14వ వర్ధంతి సందర్భంగా తణుకు, తేతలిలో గల ఏఎస్ఆర్ ఇంజనీరింగ్, ఇతర విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విజయవర్ధన్ మాట్లాడుతూ తణుకు ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి ఎంతో మందిని ఇంజనీర్లు తీర్చిదిద్దారని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలో 32 విద్యా సంస్థలను ఎల్‌కేజీ నుంచి పీజీ వరకూ స్థాపించడంతో పాటు జిల్లాల్లో ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈకార్యక్రమంలో సీఈవో కస్సే రాజశేఖర్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ పోలిశెట్టి శ్రీనివాసరావులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ప్రత్తిపాడు, కొవ్వూరు, తణుకు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్‌లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

21న ఫెయిత్ చర్చిలో స్త్రీల ఉజ్జీవ సదస్సు

పెంటపాడు: తాడేపల్లిగూడెం కొండాయిచెర్వు ప్రాంతంలోని ఫెయిత్‌చర్చి ఆవరణలో ఈనెల 21న స్త్రీల ఉజ్జీవ సదస్సు నిర్వహించనున్నట్లు చర్చి స్త్రీల సభల కన్వీనర్ బి. సుస్మిత ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి నిర్వహించబోయే ఈ సదస్సుకు అనంతపురం జిల్లా గుత్తి బైబిల్ మిషను ముఖ్యప్రసంగీకురాలైన దైవజనురాలు బి. మణికుమారి హాజరవుతారన్నారు. రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సదస్సుకు క్రైస్తవ విశ్వాసులు తప్పక హాజరుకావాలన్నారు.

డిపోమేనేజర్‌పై దాడికి ఖండన

తణుకు: తణుకు ఆర్టీసీ డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్‌పై డ్రైవర్ నాగరాజు దాడి ఘటనను ఏపీపీటీడీ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్యూటీ విషయంలో డ్రైవర్ నాగరాజు కత్తితో డిపో మేనేజర్‌పై దాడి చేయడం గర్హనీయమన్నారు. ఇలాంటి చర్యలు అధికారుల మనోధైర్యాన్ని కుంగదీస్తుందన్నారు. దాడి చేసిన డ్రైవర్ నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారుల సంఘం తరపున కార్యదర్శి జి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

శివలింగాల తయారీలో మహిళలు నిమగ్నం

- నీలాద్రిపురం నుంచి 40వేల శివలింగాల తయారీ లక్ష్యం
- తొలుత జంగారెడ్డిగూడెం.. అక్కడ నుంచి వారణాసికి తరలింపు

తాడేపల్లిగూడెం రూరల్: పరమశివునికి అత్యంత ప్రీతికరమైన క్షేత్రాల్లో వారణాసి ఒక్కటి. ఈ క్షేత్రంలో రానున్న కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శివసంకల్పమస్తు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 నుంచి 27వ తేది మధ్య కోటి పార్థివ లింగార్చన నిర్వహించనున్నారు. ఈ మహాయజ్ఞంలో తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం, పరిసర గ్రామాలకు చెందిన మహిళలు శివలింగాల తయారీలో నిమగ్నమయ్యారు. శివలింగాల తయారీకి అవసరమైన పుట్ట మన్ను (మట్టి) కాశీ మహాక్షేత్రం నుంచి తీసుకొస్తున్నారు. ఇక్కడ 40వేల శివలింగాలు తయారు చేసి, కాశీకి తరలించాలని లక్ష్యంగా మహిళలు నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా ప్రతి నిత్యం వంద మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని పరిశ్రమిస్తున్నారు. ఇలా తయారు చేసిన శివలింగాలను తొలుత జంగారెడ్డిగూడెం తరలిస్తారు. అక్కడ నుంచి కాశీ మహాక్షేత్రానికి పంపించనున్నట్టు మహిళలు చెబుతున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల శివలింగాలను పంపించాలని నిర్ణయించినట్లు తెలిపారు.



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో శివలింగాల తయారీలో నిమగ్నమైన మహిళలు

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా సుజాత

తాడేపల్లిగూడెం రూరల్: డ్వాక్రా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా మల్లిపూడి సుజాత నియమితులయ్యారు. కార్యదర్శిగా దారపురెడ్డి శేషారత్నం, కోశాధికారి మరపట్ల పవిత్ర, ఉపాధ్యక్షురాలిగా పెనుమాక జయమ్మ, జాయింట్ సెక్రటరీగా మలపర్తి రమణ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక మండల మహిళాసమాఖ్య భవనంలో మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఏపీఎం జీవీకే డీఎం.లక్ష్మి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నూతన సంఘాల ఏర్పాటుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు

జగన్ హయాంలో మహిళలకు గుర్తింపు

ఆకివీడు : సీఎం జగన్ ప్రభుత్వంలో మహిళలు మహారాణులుగా గుర్తింపు పొందుతున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక 16వ వార్డులో జీవన జ్యోతి స్లమ్ సమాఖ్య సర్వసభ్య సమావేశం గురువారం నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి నివాసం వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైమావతి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా, సున్నా వడ్డీ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఆశయంతో సీఎం జగన్ కృషి చేస్తున్నారని వివరించారు. మహిళలు డ్వాక్రా రుణాల్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. రుణాలు తిరిగి చెల్లించడం, పొదుపు పాటించడం, సంఘాల్లో ఉన్న మనస్పర్థల్ని తొలగించుకోవాలని సూచించారు. సమావేశంలో విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు గేదెల అప్పారావు, దొడ్డి జగదీష్, మెప్మా అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ హైమావతి

ఖుర్‌ఆన్ కంఠస్త పోటీల పోస్టర్ విడుదల

సాక్షి, భీమవరం: యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఖురానిక్ స్టడీస్ సంస్థ ఆధ్వర్యంలో ఖుర్‌ఆన్ కంఠస్త పోటీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా నిర్వాహకుడు ముహమ్మద్ సిద్దీఖ్ తెలిపారు. ఈ పోటీల పోస్టర్‌ను భీమవరంలో గురువారం విడుదల చేశారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ధార్మిక విషయాలు, నైతిక విలువలు నేర్పాలనే లక్ష్యంతో ఖుర్‌ఆన్ కంఠస్త పోటీలు నిర్వహిస్తున్నట్లు సిద్దీఖ్ చెప్పారు. మూడు నుంచి 12 ఏళ్ల వయసుగల బాలబాలికలకు వచ్చే నెలలో పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు సెల్ నెంబర్ 98486 77137లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ భీమవరం పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, మహబూబియా మస్జీద్ ఇమామ్ షేక్ ఫరీద్ బాబా, ఎస్ఐఓ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అనస్, ముహమ్మద్ తన్వీర్, సయ్యద్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.



ఖుర్‌ఆన్ కంఠస్త పోటీల పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ఇంటర్నేషనల్ ఫైడ్ రాపిడ్ రేటింగ్‌లో సాయికార్తీక్‌కు స్థానం

సాక్షి, భీమవరం: అఖిల భారత చదరంగం సమాఖ్య, ప్రపంచ చదరంగం సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన ఫైడ్ రాపిడ్ రేటింగ్ జాబితాలో భీమవరం పట్టణానికి చెందిన ఆముదాలపల్లి శివ సాయికార్తీక్ ఇంటర్నేషనల్ ఫైడ్ రాపిడ్ రేటింగ్ 1110 కై వసం చేసుకున్నాడని నేషనల్ కోచ్ మాదాసు కిషోర్ అన్నారు. గురువారం సాయి కార్తీక్‌ను అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు. చినఅమిరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కార్తీక్ పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో చదరంగంలో శిక్షణ పొందుతున్నట్టు చెప్పారు. గత నెలలో భీమవరంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్లో 1110కి చేరుకున్నాడన్నారు. కార్తీక్‌ను కిషోర్, అల్లు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.



సాయికార్తీక్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలి

నరసాపురం రూరల్: వరి పంటలో గింజ పాలుపోసుకునే దశలో పిచికారీ చేయకూడదని, అవసరమైతే పురుగుమందులు ఎరువులు వాడాలని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిలకుమారి అన్నారు. నరసాపురం మండలంలోని కొత్త నవరసపురం గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో వరి పంటలో వినియోగించాల్సిన యాజమాన్యాన్ని గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ కె.రాజశేఖర్ మాట్లాడుతూ సార్వా సాగును ఒబ్బిడి చేసుకున్న రైతులు వెంటనే దాళ్వా సాగుకు సిద్ధం కావాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లుకు ధాన్యాన్ని తీసుకెళ్లే వాహనం తప్పని సరిగా జీపీఎస్ ట్రాకర్ మెషీన్‌ను ఏర్పాటు చేసుకుని రైతు భరోసా కేంద్రం వద్ద రిజిస్టరు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హబ్ ఏఓ సత్యానందం, రైతులు ఈదా బాబూరావు, ఇస్రాయెలు తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు పూర్తి చేయండి

కలెక్టర్ ప్రశాంతి

కాళ్ల: మనబడి నాడు – నేడు పాఠశాలల్లో మిగిలి ఉన్న పనులు వారంరోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పనులను గురువారం ఆమె పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. ప్రణాళికబద్ధంగా పనులను పూర్తి చేయాలని, వీటి వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. మండలంలో 15 పాఠశాలలో నాడు నేడు పనులు పూర్తయ్యాయని, 17 పాఠశాలల్లో చిన్నచిన్న పనులు పెండింగ్‌లో ఉన్నట్టు ఎంఈఓ కలెక్టర్‌కు వివరించారు. ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్, స్కూల్ డ్రాపవుట్స్‌పై సమీక్షించారు. పిల్లల హాజరు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో డీఈఓ ఆర్.వెంకటరమణ, తహసీల్దారు టీపీ కృష్ణారావు, ఎంఈఓ జి.కనకరాజు, నాడు – నేడు పనుల ఇంజినీరింగు శాఖ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఎం రమేష్, ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలాదేవి, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పనుల ప్రగతిపై మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

చినఅమిరంలో నాడు నేడు పనులపై ఆరా

భీమవరం అర్బన్: పాఠశాలల్లో మిగిలిన నాడు నేడు పథకం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని నాడు నేడు పనులను ఆమె పరిశీలించారు. పాఠశాలల్లో అభివృద్ధి పనులపై డీఈఓ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో నాడు నేడు పనులపై కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. మండలంలో మిగిలిన గ్రామాల పాఠశాలల ప్రగతిపై ఆరా తీశారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరిసరాలను, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, నాడు నేడు పనుల ఇంజినీరింగ్ శాఖ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ ఎం రమేష్, ఎంఈఓ వి.వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.